# మధుమతి

శ్రీమతి సత్యవాడ ఇందిరాదేవి

"స్వాగతం. మధుమతీహృదయాధినేతలకు, శ్రీ చిట్టిబాబుగారికీ" అంటూ ఆఫీసునుంచి వచ్చిన భర్తకు చిరునవ్వుతో ఎదురు వెళ్ళింది మధుమతి.

ఆఫీసు వర్కుతో కొంచెం అలసినట్లు కనిపిస్తున్న చిట్టిబాబుగారు కళకళలాడుతున్న భార్య ముఖం చూసి, ఆమె ఆదరానికి ఒకింత సేదదీరి హాయిగా నవ్వాడు.

"బావుంది. గుమ్మంలోనే నుంచుండిపోయారేమర్రా పిల్లలూ" అంటూ వచ్చింది రాజమ్మ.

"అహహ, ఏంలేదమ్మా! నీ కోడలు ఇంట్లోకి రావద్దంటేనూ... బ్రతిమిలాడు

అన్నాడు చిట్టిబాబు.

"చూశారా అత్తయ్యా! ఎంత అబద్ధాలో నూ.." అంటూ మూతి వంకరగా తిప్పి ఆనక నవ్వేసింది మధుమతి.

ఆ విధంగా ఉన్న కొడుకూ కోడళ్ళను చూసుకొని మురిసిపోతూ వంటింట్లోకి వెళ్ళింది రాజమ్మ.

"ఇంక లోపలికి వస్తారా? దారి పొడుగునా పూల బారులు తీర్చి మంగళ వాయిద్యాలవీ ఏర్పాటు చెయ్యమంటారా? ఏమిటి సెలవు?" చేతులు కట్టుకొని మరీ అడిగింది మధుమతి.

"నీ నవ్వులు పూలబారులుగా, నీ చూపులు మంగళ వాయిద్యాలుగా..." అంటున్నాడు చిట్టిబాబు.

"ఆగండాగండి! చూపులు వాయిద్యాలేమిటీ? ఉపమానం బొత్తిగా సరిపోలేదు" అంటూ లోపలికి వెళ్తున్న భర్త ననుసరించింది మధుమతి.

భర్త విప్పిన బూట్లు ఒక ప్రక్కగా పెట్టి కోటు తీసుకువెళ్ళి భద్రపరచి "సబ్బా, తువ్వాలూ రెడీగా ఉంచాను కాని దొరగారూ! తమరు మొహం కడుక్కురండి. మేము కాఫీ టిఫిన్ తెస్తాం" అని చెప్పి అత్తగారి దగ్గిరికి వెళ్ళింది. ఆవిడ చేసిన కాఫీ టిఫిన్ తీసుకెళ్ళి భర్తకిచ్చింది.

"ఇదుగో ఆఫీసుకి ఉత్తరం వచ్చింది" అని జేబులోనుంచీ తీసిచ్చాడు చిట్టిబాబు. అబ్బ! ఇంత సేపూ చెప్పరేమండీ!" అంటూ ఒక్క ఉదుటన ఆ ఉత్తరం అందుకుంది మధుమతి. ఆ దస్తూరీ చూడగానే వర్షాకాలంలో వరదలవేళ గోదావరితల్లి లా ఉప్పొంగిపోయింది. ఆమె సంతోషం గట్లు ఒరుసుకొని ప్రవహించసాగింది.

"కాఫీలో పంచదార తక్కువైందోయ్" అంటున్న భర్త మాటలుకానీ, "అమ్మాయ్ మధూ! ఇంకో ప్లేటిలా ఇవ్వు, నువ్వూ తిందువుగాని" అంటున్న అత్తగారి మాటలుకానీ ఆమె చెవుల్లోకి జొరబడలేదు.

గబగబ చదివేసి "మా నాన్న ఉత్తరం వ్రాశారండీ! మా నాన్న! సంక్రాంతి పండగకు మనల్నందరినీ రమ్మనమని, ఆయనో మా అన్నయ్యో వచ్చి పిలుస్తారట కూడా" అని భర్తతో చెప్పింది.

"మరే అత్తయ్యా! మా నాన్న ఉత్తరం వ్రాశారు! పెళ్ళయ్యాక వచ్చిన మొదటి పండగ కదా సంక్రాంతి..." అంటూ వంటింట్లోకి సంబరంగా పరిగెత్తింది.

"హుం! ఈ ఆడపిల్లలింతే... ఎంత ఆపేక్షగా చూసుకుంటే నేమి? ఎంత ప్రాణం పెడితేనేమి? భర్త అన్నవాడు కానీ, అత్తవారు కానీ కంటికి ఆనరు. నీరు పల్లానికి ప్రవహించినట్లు అయస్కాంతంచేత ఆకర్షింపబడుతున్న

ఇనుములాగా పుట్టింటికి పరిగెత్తుతారు." అని కోపంగా నిట్టూర్చాడు చిట్టిబాబు.

ఆ తరువాత కొద్దిరోజులకే మధుమతి అన్నయ్య రాజశేఖరం వచ్చి పండక్కి రమ్మని అందర్నీ పిలిచాడు.

"చూద్దాం, సెలవు దొరుకుతుందో లేదో" అని నసిగాడు చిట్టిబాబు.

"అలా అనకండి బావగారూ! పండక్కి ఎలాగా సెలవిస్తారు కదా. తప్పకుండా రావాలండీ మీరు... మీరు వస్తే అత్తగారూ, మామగారూ కూడా వస్తామన్నారు. ఈసారికి మా ప్రార్థన మన్నించండి." అంటూ బ్రతిమలాడాడు రాజశేఖరం.

"సర్లెండి..." అంటూ మొహానికి నవ్వు పులుముకున్నాడు చిట్టిబాబు. ఆ సంభాషణ చూసి మధుమతి హృదయంలో ఏదో తీవ్రమైన అశాంతి, ఏదో మంట బయలు దేరింది.

"పెళ్ళయిపోంగానే అత్తగారి ఇంటికి రమ్మని తననెవరూ బ్రతిమాలలేదే. బ్రతిమాలలేదు సరికదా అదేదో వాళ్ళ హక్కయినట్లు తీసుకెళ్ళిపోయారే. ఒక్కసారి పండగకి రమ్మనమని ముచ్చటపడి వాళ్ళు పిలుస్తూఉంటే ప్రాధేయపడుతూ ఉంటే బెట్టుసరి చేస్తారేమిటీయన! తను వీళ్ళకి కోడలైనట్లే ఈయన వాళ్ళకు అల్లుడు కాడా? జీవితాంతమూ ఉండటానికి సిద్ధపడివచ్చిందే. తను ఒక్క పండగ రోజున అత్తగారింట్లో గడపలేరన్న మాట ఈయన. ఈ లోపం ఎక్కడుంది? ఏమైనా ఆడ పుటక పుట్టడంకంటే అడవిలో మానై పుట్టటమే మేలా? ఇప్పటికీ, ఎంత చదువుకున్నా సంఘం ఎంత పురోభివృద్ధి సాధించినా!... ఇంతేనా?" అని గిజగిజలాడిపోయింది మధుమతి.

వాళ్ళింటికి వెళ్ళాలనేనా? వెళ్దాంలే" అంటూ అభయం ఇచ్చాడు చిట్టిబాబు ఆ మర్నాడు.

"నిజంగానా అండీ? నిజంగా మీరు వస్తారా? అబ్బ ఎంత మంచివారండీ మీ రసలు. అత్తగారు అన్నంపెట్టి పాడు చేస్తున్నారు కానీ!" అంటూ నవ్వింది మధుమతి. అంతకుముందు తను అనుకున్నవన్నీ ఒక్క క్షణంలో మర్చిపోయింది. హృదయంనిండా భర్త యెడల అనురాగవాహిని పొంగిపొరలిపోయింది. ఆమె సంతోషం పట్టశక్యం గాకుండా పోయింది. ఓహ్... తను పుట్టింటికి వెళుతున్నది తన భర్తతో కలిసి. కొన్ని నెలలై పోయింది వాళ్ళందర్నీ చూసి. ఎట్లా ఉండగలిగిం దిన్నాళ్ళు. అమ్మా నాన్నా ఎంత గారాబంగా పెంచారు తనను. 'ఒక్కరోజు కూడా విడిచిపెట్టి ఉండలేనంటావు. పెళ్ళైతే కాపరానికెవరు వెళ్తారే' అని నవ్వేది అమ్మ. 'నే నసలు పెళ్ళే చేసుకోను బాబోయ్' అని అరిచి అక్కణ్ణుంచి పారిపోయేది తను. ఆ ఊహే బాధాకరంగా వుండేది. రోజూ అమ్మ వెయ్యాల్సిందే జడ. అన్నం తింటూకూడా చదువుకుంటుంటే 'బాల్లే, ఇహ తిన్నట్టె' అంటూ అమ్మే అన్నంకలిపి ముద్దలు పెట్టేది.

అమ్మా, నాన్నా, అన్నయ్యా, వదినా, చెల్లెళ్ళా అందరూ ఎంత ఆప్యాయంగా ఎంతిష్టం. తల్చుకుంటే నవ్వొస్తోంది. వైజాగ్‌లో ఎమ్బీబీఎస్ సీటొస్తే వది లేసుకోని ఉన్న ఊళ్ళోనే బీఎస్సీలో చేరింది. అట్లాంటి తను పెళ్ళిచేసుకుని సరాసరి అత్తవారింటికి వచ్చేసింది. ఇన్ని నెలలకు మొట్టమొదటిసారిగా పుట్టింటికి వెళ్ళబోతున్నది. ఆసంతోషంలో ఆమెకు ప్రకృతంతా పసమయంగా ప్రపంచమంతా ఆనందకరంగా కనిపించింది.

అత్తగారి సలహామీద ఆవిడతోకలిసి బజారుకెళ్ళి పుట్టింట్లో అందరికీ చిన్న చిన్న బహుమతులు కొన్నది. తండ్రి కోసం నగిషీలు చెక్కిన సరస్వతీపీఠం కొంటున్నప్పుడైతే ఆమె కళ్ళు సంతోషంతో చెమర్చాయి. రాజమ్మ అది గమనించి 'పిచ్చిపిల్లా' అనుకుని కోడలి భుజం మీద ఆప్యాయంగా తట్టింది. 'అత్తయ్యా' అంటూ ఆవిడను అల్లుకు పోబోయి అంతలో అది బజారని గుర్తుకొచ్చి మానేసింది మధు. ఎంత మంచివారమ్మా మీరు! నా పురాకృత కర్మఫలం పండి మీ వంటి ఉత్తమురాలికి కోడలి నైనాను' అనుకుంది.

* * *

ఆరోజే బయల్దేరవలసిన రోజు.

మధుమతి కాళ్ళు నేలమీద నిలవట ల్లేదు. "అత్తయ్యా! ఏ చీరలుతీసుకెళ్దాం. మీ బెనారస్ చీరమటు కిప్పుడే పెట్లో పెట్టేస్తున్నా. అన్నట్లు, ఏ సూట్‌కేస్




తీసుకెళ్దాం?" అంటూ హడావుడి పడుతూ ఇల్లంతా తిరిగేస్తోంది. మాటి మాటికీ వీధి గుమ్మంవరకూ వెళ్ళిచూస్తోంది. "ఈయనింకా రారేం? అబ్బ-ట్రైనుకు టైమైపోతున్నదే" అనుకుంటూ సామాన్లన్నీ సర్దేసి తను తయారై పోయి కూచుంది.

నిరుత్సాహంగా వచ్చాడు చిట్టిబాబు.

"అమ్మయ్య! వచ్చేశారా? మేము రెడీ అయిపోయాం, మీదే తరువాయి. అన్నట్లు ఇంత ఆలస్యంఅయిందేమిటండీ, ఇవ్వాళ. ట్రైన్‌కి టైమైపోతోంది. ఊ...త్వరగా తయారవండీ!" అట్లా భర్త మొహంవేపు చూసి "ఏమిటండీ! అట్లా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా?" అని ఆదుర్దాగా అడిగింది మధుమతి.

"అది కాదు మధూ! నువ్వు బాధపడతావేమో మరి-నీకొక విషయం చెప్పాలి" అన్నాడు చిట్టిబాబు.

"పర్వాలేదు ఏమనుకోను. తొందరగా చెప్పెయ్యండీ ప్లీజ్. అవతల టైమైపోతోంది," అన్నది మధుమతి ఆదుర్దాగా.

"నేను మా ఆఫీసరుతో కలిసి అర్జంటుగా క్యాంపుకు వెళ్ళాల్సి వచ్చింది. పాపం ఆయనక్కూడా పండుగనాడు పరాయిచోటే మకాం, ఏం చేస్తాం చెప్పు-డ్యూటీ అన్నాక తప్పుతుందా? ఏవిటో-ప్చ్-" అంటూ నిట్టూర్చాడు తను.

మధుమతి నిలబడలేనట్లై పోయి తను సర్దిన పెట్టె అక్కడుంటే దానిమీద కూలబడింది.

నట్లేనా! సుధాకర్ కూడా కాంప్‌కి వస్తున్నారా!" అని అడిగింది నీరసంగా.

"సారీ మధూ! ఏం చెయ్యమన్నావు మరి?" అయామ్ హెల్ప్‌లెస్. ఈ సారికి నువ్వెళ్ళిరా. మీ పుట్టింటికేగా. హాయిగా సర్దాగా గడుపుకోవచ్చు పండగ. అక్కడైతే నేను ఊళ్ళో లేనన్న సంగతే మర్చిపోతా వించక్కా" అన్నాడు చిట్టిబాబు.

భర్త మొహంలోకి పరిశీలనగా చూసింది మధుమతి. "పండక్కూ కాంపేమిటంటీ అసలు! కంపెనీవాళ్ళకు మతిపోతే సరే. మీ బాస్‌కు కూడా మతిపోయిందా? ఆర్డరులో డేట్ సరిగ్గా ఉందా? ఏమన్నా పొరబాటు జరిగిందేమో" అన్నది ఇంకా ఆశ చావక.

"అంటే నీ ఉద్దేశం... మేమంతా కళ్ళులేని వాళ్ళమనా? ఆర్డరు తెచ్చి 'ఇదిగోనండీ దేవిగారూ...' అంటూ సమర్పించుకోవాలా? చదువుకున్నదానివి కదూ మరి. పొరపాట్లుంటే దిద్దేదానివి. అప్పునా? పండగేమిటసలు ఉద్యోగస్తులకు? మా దసలే కొత్త కంపెనీ... దాని అభివృద్ధికి రాత్రింబవళ్ళు పాటుపడటమే మా కర్తవ్యం. తెలిసిందా?" అన్నాడు ఒకను కోపంగా.

మధుమతి కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. "ఆఫీసులో ఏమైనా గొడవజరిగిందేమో ఆకోపం నామీద చూపిస్తున్నారు" అను మాటలనొద్దు. ఏదో నా ఆత్రంకొద్దీ అట్లా అన్నా. నన్ను అపార్థం చేసుకుంటున్నారు అనవసరంగా". అన్నది తలొంచుకొని

చిట్టిబాబుకి జాలివేసింది—

"ఏదో కోపంలో అన్నాలేగానీ—ఏమనుకోకు. నేను రాకపోయినంత మాత్రాన ఏం మునిగిపోతుంది చెప్పు? ఇంతా ప్రయాణమై మానేస్తే బావుండదు. అక్కడ మీ వాళ్ళంతా ఎదురు చూస్తుంటారు కూడాను" అని అనునయించాడు.

"మంచి వారే - మావాళ్ళు ఎదురు చూసేది నా ఒక్కదానికోసం కాదు. ఆ సంగతి ఎట్లా అర్థమవుతుంది స్వామీ మీకు?" అని మనస్సులో ఆవేశపడింది మధుమతి. "అయినా మీ ఉద్యోగధర్మం నెరవేర్చొద్దని నేనేనాడూ అనను. ఆ మాట గుర్తుపెట్టుకుంటే చాలు సార్—" అని పైకి అంటూ—కాంతిలేని నవ్వొకటి నవ్వింది.

"ఏవిటట్లా—ఇంకా తెమల్లేదు. ఏమిటమ్మా కోడలా? వాణ్ణిలా నుంచోపెట్టేశావూ? మీ మామగారు రైలు టైమైపోయింది, వెంటనే బయల్దేరమని కేకలేస్తున్నారు. రిక్షా పిలుచుకురా నాయనా వెంకన్నా" అంటూ వచ్చింది రాజమ్మ.

"అఖ్ఖర్లేదత్తయ్యా. ఆయన కాంప్‌కి వెళ్ళాలట" అన్నది మధుమతి.

"సరే అయితే మే మెందుకిహ. ఇక్కడ చాలా పనులున్నైకూడా. పోనీ

యంగా.

"వద్దత్తయ్యా, నేను వెళ్ళను" నెమ్మదిగా అన్నది మధుమతి.

"అదేమిటి! పండగపూట ఉసూరుమంటూ ఏడవటానికా_ఇక్కడుండి? వెళ్ళటానికేం?" అని కోప్పడ్డాడు చిట్టిబాబు.

"వద్దండీ _ నాకు వెళ్ళాలని లేదు" అంటూ పెట్టెలోనుంచి బట్టలు తీసేసి యథాస్థానంలో పెట్టేసింది మధుమతి.

రాజమ్మ బాధగా చూసింది కోడలి వంక. కానీ ఆవిడ మట్టుకేం చెయ్యగలదు? "వెళ్ళమంటే వెళ్ళకపోయె నీ పిల్ల_ప్చ్_" అనుకున్న దావిడ.

ఆ మర్నాడు సుధాకర్ అంటే చిట్టిబాబు ఆఫీసర్ వచ్చాడు అప్పటికి అత్త నింట్లో లేదు.

చిట్టిబాబూ, సుధాకరు మంచి స్నేహితులు

మధుమతిని చెల్లెమ్మ అని పిలుస్తాడు సుధాకరు

"రండి అన్నగారూ! బహుకాలం దర్శనం. ఆయన బజారుకు వెళ్ళారు. ఇప్పుడే వస్తారు. కూచోండి" అని ఆహ్వానించింది మధుమతి.

"కులాసాగా ఉన్నావామ్మా" అని అడిగాడు సుధాకరు.

"ఆఁ_ వదినగారు కులాసానా అండీ!" అని అడిగి లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చి ఇచ్చింది మధుమతి.

"ఏమిటమ్మా పండగ ఏర్పాట్లు?" అని.

"ఇంక ఏర్పాట్లేమిటి లెద్దురూ.!" అని నిట్టూర్చిందామె

"అదేమిటమ్మా అట్లా అంటున్నావు" అని ఆశ్చర్యపోయాడు సుధాకరు.

"ఇంతకీ మీరు కాంప్‌కి వెళ్ళటం ఎప్పుడు?" అని అడిగింది మధు.

"నేనా? కాంప్‌కా?" ఆశ్చర్యంగా అడిగారు సుధాకరు

"ఔను మరూ ఆయనా వెళ్ళుతున్నారటగా పండగకు ఊళ్ళో ఉండరట!" అన్నది మధుమతి

"ఓ! ఐసీ! మర్చిపోయాను. వెళ్ళాలమ్మా వెళ్ళాలి!" ఆయన తడబాటు చూసి విస్తుపోయింది మధు. ఇంతలో రానే వచ్చాడు చిట్టిబాబు. సుధాకరుని చూసి పాలిపోయింది సగగాడి మొహం

"మధూ? అమ్మ పిలుస్తున్నట్టుంది చూడు" అన్నాడు.

ఆమె లోపలి కెళ్ళిపోయింది.

"ఏమిటి చిట్టిబాబూ అసలు సంగతి. ఏదైనా చిన్న ప్రణయ కలహం?" అంటూ నవ్వాడు సుధాకరు

నానుస్తూ నానుస్తూ అసలు సంగతి చెప్పాడు చిట్టిబాబు

"అంతమాత్రానికి ఆఫ్టరాల్ ఇంత చిన్న విషయానికి ఆడపిల్లతో అబద్ధం చెప్తావుటయ్యా పెద్దమనిషీ. ఉన్న విషయం ఉన్నట్లు చెప్పేస్తే అమ్మాయి సర్దుకు

ప్రేలదనుకుంటున్నావా? ఏం" అని సన్న సన్నగా అడిగాడు సుధాకరు.

చిట్టిబాబు పైకి మాట్లాడలేదు. కాని చెల్లెలంటే పక్షపాతంఅనిగొణుక్కున్నాడు,

"అది సరే! ఆవిడకు నువ్వంటే ఇష్టమో, పుట్టిల్లంటే ఇష్టమో తేల్చుకున్నావా మరి. వెళ్తానన్నదా వాళ్ళింటికి" అని అడిగాడు.

పశ్చాత్తాపంగా చూశాడు చిట్టిబాబు.

"బలేవాడివి మొత్తానికి. నీ సహధర్మచారిణిని, నీ ఇల్లాల్ని బాగా బోల్తా కొట్టించావన్నమాట. సరే, అయిందేదో అయింది. ఆవిడ దగ్గరకు వెళ్ళి లెంప లేసుకుంటావో గుంజీళ్ళే తీస్తావో- నేను వెళ్తున్నా నిహ ఇవ్వాళ బయలుదేరి మీ అత్తగారింటికి వెళ్ళచ్చుమీరు.ఎల్లుండిగదా పండగ. విష్‌యూ ఎ హాపీజర్నీ" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు సుధాకరు.

"పిలిచారా అత్తయ్యా" అని లోపలికి వెళ్ళిన మధుమతి "నేను పిలవలేదమ్మా" అన్న అత్తగారి మాటలకి ఉలిక్కిపడింది.

"మరి ఆయన లోపలికెందుకు పంపించారు. నిజమే అయ్యుంటుంది. లేకపోతే సుధాకర్ గారు ఎందుకు ఖంగారు పడతారు. మా వాళ్ళింటికి రావటం ఇష్టంలేక క్యాంప్‌కి వెళ్తున్నానని అబద్ధం చెప్పారన్నమాట. అయ్యో చిలకా గోరింకల్లా కూతురూ, అల్లుడూ పండగపూట ఇంట్లో తిరుగుతూ ఉంటే చూడాలని అమ్మా నాన్నా ఎంత ఉబలాట పడ్డారో! అన్నయ్యా. వదినా. తమ్ముళ్ళూ. చెల్లెళ్ళూ ఎంత ఉత్సాహంగా ఎదురుచూశారో! అందరూ ఎంత నిరాశ పడుతున్నారో? హుఁ... నా సమస్తమైన ఆశయాలనీ, అభిరుచులనీ, అలవాట్లనీ మార్చుకొని ఆయనకెంత అనుగుణంగా తయారైనాను. కానీ నాకోసం, నా యీ ఒక్క కోరిక తీర్చటం కోసం ఆయన మా పుట్టింటికి రాలేరన్నమాట. తన భార్య హృదయంలో పరిపూర్ణ తృప్తిని కలిగిస్తే అది తనకు ఎంత సంతోషం కలిగిస్తుందో తెలియదు కాబోలీయనకు. ఎంత పట్టుదల? భార్యాభర్తలు పరస్పరావగాహనలతో ఒకరి అభిప్రాయాలను ఇంకొకరికి అనుగుణంగా మార్చుకుంటే ఎంత బావుంటుంది? సంసారాన్ని స్వర్గతుల్యం చేసుకుంటున్నట్లు కాదూ? ఎంత సేపూ స్త్రీ నుంచే మార్పురావాలి కాబోలు. పురుషుడు తన అభిప్రాయాలను గానీ, ఉద్దేశాలను కానీ వీసమెత్తుకూడా మార్చుకోరాదు-ప్చ్-మనసులోని అసంతృప్తి తుషాగ్నిలా దహించివేస్తుంటే పైకి నవ్వుతూ తిరగాలి కాబోలు ఇల్లాలు. హుఁ ఎంత పిచ్చిదాన్ని నేను-ఎన్ని పగటి కలలు కన్నాను? అయ్యో!" అనుకున్నది పాపం మధుమతి. ఆమె కళ్ళల్లో ఎరుపుజీరలతోపాటు కన్నీళ్ళు కూడా మెరుస్తున్నాయి.

"సారీ మధూ! నన్ను క్షమిస్తావు కదూ"

అంటూ వచ్చాడు చిట్టిబాబు.

"ఛ! ఎంతమాట! నేను మిమ్మల్ని క్షమించటమేమిటి? మీకేమండీ. మీరు మగవాళ్ళు. మీమాట రాజశాసనంగా చెల్లుబడి అవుతుంది సంఘంలో,"ముని పంటితో పెదవి బిగబట్టి అన్నది మధు. ఆమె కళ్ళనుంచి జల జలా రాలాయి కన్నీళ్ళు.

"నేను చాలా సిగ్గు పడుతున్నాను మధూ! తప్పు చేసింది నేను, నన్ను శిక్షించే హక్కున్నది నీకు. నువ్వేడుస్తావెందుకు? పుట్టింటి కంటే నన్నే నువ్వభిమానిస్తున్నావని కొద్దిగా ఆలస్యంగా గ్రహించాను. నేను చెప్పిన అబద్ధం తాత్కాలికంగా కష్టం కలిగించినా మన భవిష్యత్ జీవితానికి బంగారు బాటలు పరిచింది తెలుసా నిన్నింకెప్పుడూ అవమానించను. నీవ్యక్తిత్వాన్ని కించపరిస్తే, నా వ్యక్తిత్వాన్ని కించపరచుకున్నట్లు, సరేనా. చెప్పు మధూ! నన్ను మన్నించగలవా?" అని అడిగాడు చిట్టిబాబు.

"తప్పులేదు. మన్నించటమూ లేదు ఊరుకోండి" అన్నదామె 'ఇంక వెళ్ళాలనిపించడం లేదు నా పగటికల చెదిరిపోయిందండీ నా గాలిమేడ కూలిపోయింది. ఇంకెప్పుడూ ఏ కలలూ కనను, జాగ్రత్తగా ఉంటాను' అనుకుంది మనస్సులో.

భావించటం మానేట్లు లేవు. ఇదా మధూ నాకు విధించిన శిక్ష. ప్లీజ్. నువ్వు మామూలుగా అయిపోతావనీ మన సంసారం ఇది వరకు లాగే హాయిగా సాగిపోతుందని ఆశ పడుతున్నాను. కాస్త ఆలోచించి చెప్పు. నీ కోపం తగ్గటానికి ఎన్నాళ్ళు పడుతుంది?" అని అడిగాడు చిట్టిబాబు ఆత్రంగా.

అతని గొంతులో బాధా సమ్మిశ్రితమైన జీర.

అంతలో "అమ్మాయి మధుమతీ! ఒకసారి ఇలా రామ్మా" అంటూ పిలిచింది రాజమ్మ వంటిట్లోంచి.

"అదిగో అమ్మ పిలుస్తున్నది చూడు" అన్నాడు చిట్టిబాబు.

"నిజంగా పిలుస్తున్నారా?" ఓరగా తలతిప్పి తమాషాగా అడిగింది మధుమతి.

"కాదు. అబద్ధంగా పిలుస్తున్నారు." రోషంగా అన్నాడు చిట్టిబాబు.

"సరేగానీ... ఒకసారి నవ్వండీ!" అన్నది మధుమతి.

"ఎందుకు?" అప్రయత్నంగా అడిగేశాడు చిట్టిబాబు.

"నా కోసం. మీ దాసిని, మీ సతిని, మీ ప్రేయసిని, మీదాన్ని అయిన నా కోసం. ఒక్కసారి నవ్వండి సార్!" అంటూ అత్తగారి దగ్గిరికి పారిపోయింది సార్థకనామధేయురాలైన మధుమతి.